క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మళ్ల విజయప్రసాద్‌ను కలిసిన వినీత రెడ్డి

విశాఖ విద్య: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కోనాల వినీతరెడ్డి గురువారం సీతమ్మధార క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయిలో పదవి ఇచ్చినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్ పార్క్ ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లో క్రీడా, వ్యాయామ పార్కును గురువారం మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. శాంతినగర్ పార్క్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులతో కలసి ఆయన రిబ్బన్ కట్‌చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ పార్క్‌ను ఆధునిక రీతిలో సుందరీకరించామన్నారు. మోడల్ లైటింగ్, పార్క్‌లో జిమ్ పరికరాలు, చిన్నారుల ఆట పరికరాలు, రబ్బర్ ఫ్లోరింగ్ వంటి పనులను సుమారు రూ.45 లక్షలతో అభివృద్ధి చేశామని తెలిపారు. కాలనీలోని ప్రజల మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే రీతిన ప్రజల కోసం పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో జియ్యాని విజయ్‌కుమార్, వెంకటరమణ, సెక్రటరీ శ్రీనివాస రావు, సత్యనారాయణ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చరిత్ర ఒలింపియాడ్‌కు అభినవ్‌రెడ్డి



దాబాగార్డెన్స్: ప్యారిస్ నగరంలో ఈ నెల 19 నుంచి 27 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ చరిత్ర ఒలింపియాడ్‌లో నగరానికి చెందిన పన్నెండేళ్ల అభినవ్‌రెడ్డి భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇంటర్మీడియట్ విభాగంలో ఫైనల్స్‌లో పోటీపడుతున్న అభినవ్ దేశ వ్యాప్తంగా ఎంపికైన ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సవాల్‌కు సిద్ధమవుతున్న అభినవ్ ప్రయాణం యువ అభ్యాసకులకు ప్రేరణగా నిలుస్తోంది.


వాల్తేర్ డివిజన్‌లో ఆకస్మిక తనిఖీలు



సింహాచలం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న కమర్షియల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ఆదేశాలతో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్, కమర్షియల్ సిబ్బంది, రైల్వే భద్రతా దళం సిబ్బందితో కలిసి గురువారం పలు రైళ్లు, స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారి నుంచి, సరైన టికెట్లు లేకుండా ప్రయాణిస్తున్న వారి నుంచి, సరిగా బుక్ చేయని లగేజీలకు జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో 211 కేసులు నమోదు చేసి, వారి నుంచి సుమారు రూ.1.10 లక్షల జరిమానాలుగా వసూలు చేశారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో ఈ నెల 1 నుంచి 16 వరకు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో 26,411 కేసులు నమోదు చేసి, వీరి నుంచి సుమారు రూ.1.5 కోట్లు అపరాధ రుసుముగా వసూలు చేసినట్లు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

రహదారులు గోతులమయం



గోపాలపట్నం: ప్రభుత్వ పాలకులు, అధికారులు ప్రజల సమస్యలను గుర్తించి అభివృద్ధి చర్యలు చేపడుతుంటారు. వారే నిర్లక్ష్యం వహిస్తే ప్రజలకు ఇబ్బందులే ఎదురవుతాయి. జీవీఎంసీ 92వ వార్డులో ఈ పరిస్థితి నెలకొంది. వార్డులోని గోపాలపట్నం పరిధి నరసింహనగర్, ఇందిరానగర్, గణపతినగర్ ప్రాంతాల్లోని రహదారుల్లో జీవీఎంసీ నిరంతర మంచినీటి సరఫరా విభాగం అధికారులు గోతులు తవ్వి వదిలేశారు. ఇవి ఇప్పుడు స్థానికుల పాలిట ప్రాణ సంకటంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెద్ద గోతుల్లా తయారయ్యాయి. ఈ రహదారులపై ప్రయాణిస్తున్న వాహన చోదకులు, పాదచారులు నిత్యం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. బాగున్న రోడ్డును అధికారులు తవ్వి వదిలేస్తున్నారని, వాటి వల్ల నిత్యం ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. యూజీడీ విభాగం అధికారులు ఇందిరానగర్ ప్రధాన రహదారిలో వ్యక్తిగత కనెక్షన్ కోసం తవ్విన గోతిని ఏళ్లు గడిచినా పూడ్చక పోవడంతో ప్రమాదకరంగా తయారైంది.

> **గోతులు పూడ్చండి**
>
> 92వ వార్డులోని పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరా పనుల నిమిత్తం రోడ్లు తవ్వి వదిలేశారు. దీంతో గోతులు ఏర్పడి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి గోతులు పూడ్చేందుకు తక్షణం చర్యలు చేపట్టాలి.
>
> – సూర్య, నరసింహనగర్



ఇందిరానగర్ ప్రధాన రహదారిలో యూజీడీ గొయ్యి

ఈ గోతిలో వాహన చోదకులు పడి గాయాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ రహదారులు ఎగుడు దిగుడు ప్రాంతం కావడంతో గోతుల వల్ల రాళ్లు తేలి ఉంటున్నాయని, దీంతో మరింత ప్రమాదకరంగా తయారవుతోందని వాపోతున్నారు. ఈ రహదారిలో ఐదారు చోట్ల తవ్వేయడంతో గోతులు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి రహదారుల్లో తవ్వి వదిలేసిన గోతులను వెంటనే పూడ్చాలని 92వ వార్డు వాసులు కోరుతున్నారు.






నరసింహనగర్‌లోని పలు వీధుల్లో తవ్వి వదిలేసిన రహదారులు

ఎఫ్‌ఆర్‌యూ ఆస్పత్రిని ప్రైవేటుపరం కానివ్వం



ఎఫ్‌ఆర్‌యూ ఆస్పపత్రిని ప్రభుత్వమే నడపాలని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద గల ఎఫ్‌ఆర్‌యూ(జీవీఎంసీ 30 పడకల ఆస్పత్రి)ని కోరమాండల్ సంస్థకు అప్పగించాలని పాలకులు, అధికారులు ఆలోచిస్తున్నారని, దీనిని తాము అడ్డుకుంటామని సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పైడిరాజు అన్నారు. 59వ వార్డు నెహ్రూ నగర్‌లో గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో పేద రోగులకు ఎఫ్‌ఆర్‌యూ సంజీవనిగా నిలుస్తోందన్నారు. అలాంటి ఆస్పత్రిని ప్రైవేటు పరం చేయాలని పాలకులు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని కోరమాండల్‌కు అప్పగిస్తే వారు రోగుల వద్ద నుంచి ఫీజులు వసూలు చేస్తారన్నారు. అది పేదలకు భారమవుతుందని, ఈ ఆలోచన సరికాదని సూచించారు. తక్షణం ఎమ్మెల్యే గణబాబు ఈ విషయంలో జోక్యం చేసుకుని ఎఫ్‌ఆర్‌యూ ఆస్పత్రిని ప్రైవేటుపరం కాకుండా కాపాడాలన్నారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు పట్టవా..?



సింహాచలం రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో తవ్వి వదిలేసిన గోతులు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వేసేందుకు తవ్విన గోతులను వారం పది రోజులుగా అలాగే వదిలేశారు. వీటి వల్ల నిత్యం ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ గోతులు ప్రమాదకరంగా మారాయని వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో వస్తున్న ప్రయాణికులు, వారి కోసం వచ్చే వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో గోతులు తవ్వడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైల్వే స్టేషన్ రోడ్డు ఇరుగ్గా ఉండటంతో రోడ్డుపైన వాహనాలు నిలిపితే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. రద్దీ సమయాల్లో నరకం చూడాల్సి వస్తోందని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రయాణికుల రద్దీతో ఉండే ప్రాంతాల్లో వెంటవెంటనే పనులు పూర్తి చేయాల్సి ఉన్నా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని మండిపడుతున్నారు. అధికారులు దృష్టి సారించి వెంటనే ఈ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

రేకుల షెడ్ నిర్మాణాల పరిశీలన



జనతా కాలనీలో నిర్మించిన రేకుల షెడ్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు జనతా కాలనీలోని రేకుల షెడ్ల నిర్మాణాలను గురువారం గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయ అధికారులు పరిశీలించారు. ఇక్కడ నాలుగు రేకుల షెడ్లను రాత్రికి రాత్రే నిర్మించడంపై స్థానికంగా విమర్శలు వచ్చాయి. 20 ఏళ్లుగా ఇక్కడ నివసిస్తున్నామని, కొన్నాళ్ల కిందట ఈ షెడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, ఇటీవలే వీటిని నిర్మించుకున్నామని కొందరు చెబుతున్నారు. వీటికి పట్టాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ రేకుల షెడ్లు సర్వే నంబర్ 76లోని కొండ పోరంబోకు స్థలంలో ఉన్నట్లు రెవెన్యూ సర్వేయర్ రాజగోపాల్, జీవీఎంసీ సర్వేయర్ కుమారస్వామి చెబుతుండటం విశేషం. ఆర్‌ఐ కోమలి, వీఆర్‌వో సుబ్రహ్మణ్యం స్థానికుల నుంచి, రేకుల షెడ్లకు సంబంధించిన వ్యక్తుల నుంచి డాక్యుమెంట్లు, పట్టాలు సేకరించారు. వీటితో పాటు స్థానికులు తెలిపిన వివరాలతో నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆర్‌ఐ తెలిపారు. ఈ పట్టాలు ఎంతవరకు నిజమైనవో అధికారులు పరిశీలించాల్సి ఉందన్నారు.

26, 27 తేదీల్లో సిటు విశాఖ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్

దాబాగార్డెన్స్: సిటూ విశాఖ జిల్లా 13వ మహాసభలు ఈ నెల 26, 27 తేదీల్లో కంచరపాలెం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. గురువారం సిటూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లలో జిల్లాలో నిర్వహించిన వివిధ కార్మిక పోరాటాలు, ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు, ఆందోళనలు రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్టు చెప్పారు. కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, ఉద్యోగ భద్రత, అసంఘటిత రంగ కార్మికుల ఉపాధి రక్షణ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు, స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం, వివిధ షాపులు, హోటల్స్, హాస్పటల్స్‌లో పనిచేస్తున్న కార్మికులు, రోడ్డుపై చిరు వ్యాపారాలు చేసుకుంటున్న చిల్లర వర్తకులు, ఆటో, మోటార్, రవాణా రంగ కార్మికుల హక్కుల గురించి, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ, పాత పెన్షన్ స్కీం అమలు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.

వృద్ధుల బాగోగులపై ఆరా



ప్రియదర్శిని హోంలో వృద్ధుల బాగోగులు అడిగి తెలుసుకుంటున్న సన్యాసినాయుడు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారం కార్యాచరణ ప్రణాళిక 2025–26లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు గురువారం నగరంలోని అక్కయ్యపాలెం ప్రియదర్శిని వృద్ధాశ్రమం, ఆశ్రయ షెల్టర్ హోం, స్వధార్ హోమ్‌లను సందర్శించారు. అక్కడ వసతి పొందుతున్న వృద్ధుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆశ్రయ షెల్టర్ హోమ్‌లో ఉన్న నిరాశ్రయుల పరిస్థితులను, ప్రియదర్శిని ఆశ్రమంలో వృద్ధుల ఆరోగ్య స్థితిగతులను, స్వధార్ హోమ్‌లో మహిళల జీవన ప్రమాణాలను ఆయన పరిశీలించారు. ఆశ్రమ నిర్వాహకులతో ఆయన మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఎటువంటి న్యాయపరమైన సమస్యలు ఎదురైనా వెంటనే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. న్యాయ సహాయం అందరికీ అందుబాటులో ఉండాలని, ప్రత్యేకించి బలహీన వర్గాలకు, అభాగ్యులకు న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గంజాయి ప్యాకెట్ల స్వాధీనం

అల్లిపురం: గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పెట్రోలింగ్‌లో భాగంగా బిర్లా జంక్షన్ బస్ స్టాప్ వద్ద ఇమ్రాన్ బేగ్, అఫ్సర్ బాషాల వద్ద రెండు ప్యాకెట్ల గంజాయిని గుర్తించారు. నిందితులు ఒడిశాలోని బరంపురం నుంచి రూ.400, రూ.300 చొప్పున గంజాయిని కొనుగోలు చేసి, తాము వినియోగించగా మిగిలిన దానిని అమ్ముకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, తదుపరి విచారణ నిమిత్తం గోపాలపట్నం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

విద్యార్థులు ప్రతి రంగంలో ప్రతిభ చాటాలి



శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

మల్కాపురం: సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమే విద్యాభ్యాస లక్ష్యమని, అందుకు విద్యార్థులు ప్రతి రంగంలో ప్రతిభను చాటుకోవాలని మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల కరస్పాండెంట్ గెసిల్లా అన్నారు. కళాశాలలో డిగ్రీ విద్యార్థినులకు ఎన్‌ఎస్‌ఎస్‌లో నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని దేశానికి ఒక మానవ వనరుగా ఉపయోగపడాలన్నారు. శిక్షణ తరగతుల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు కరస్పాండెంట్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి, జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చైతన్య స్రవంతులు చలం రచనలు

సీతంపేట: అమరావి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో గురువారం చలం స్త్రీ రచన జయంతి పేరిట ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో చలం రచించిన స్త్రీ, భగవాన్ స్మృతులు, పిల్లల కోసం మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. దేవి సీఫుడ్స్ డైరెక్టర్ గద్దె సాంబశివరావు చేతుల మీదుగా వీటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలం రచించిన పుస్తకాలు తన చేతుల మీదుగా ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. చలం ప్రశ్నించే గుణాన్ని కొనియాడారు. నవయవ్వనం, చుక్కమ్మ కథలను విశ్లేషించారు. స్త్రీ అను పుస్తకాన్ని మహిళా చేతన కార్యదర్శి కత్తి పద్మ సమీక్షించారు. ఐఆర్‌ఎస్ అధికారి పిల్లల కోసం పుస్తకాన్ని, ఆధ్యాత్మిక వేత్త రామకృష్ణానంద్ భగవాన్ స్మృతులు పుస్తకాన్ని సమీక్షించారు. మేడా మస్తాన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, పాలగుడు రాజశేఖర్, అరసం విశాఖ ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పరాజు తదితరులు చలం రచనలపై ప్రసంగించారు.

హోటల్ బిల్లు చెల్లించకుండా పరారీ

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

తాటిచెట్లపాలెం: హోటల్‌లో దిగి బిల్లు డబ్బులు చెల్లించకుండా పరారైన ఘటనపై ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం హైవే సమీపంలోని బీకాన్ హోటల్‌లో డాక్టర్ ఆనంద్ అనే వ్యక్తి ఒడిశాకు చెందిన తన పేషెంట్లు పర్వాత్‌కుమార్ బిస్వాల్, బిస్వాల్ మిత్ర, బిస్వాల్ పారియస్‌లు వస్తారని ఆన్‌లైన్‌లో రూంలు బుక్ చేసుకున్నాడు. జనవరి 28న డాక్టర్ ఆనంద్ పంపించారని వీరు రూంలో దిగారు. జనవరి 30న వీరు రూంలు ఖాళీ చేశారు. ఆ సమయంలో బిల్ గురించి అడగ్గా.. డాక్టర్ ఆనంద్ చెల్లిస్తారని చెప్పి వారు వెళ్లిపోయారు. అప్పటి నుంచి డాక్టర్ ఆనంద్‌కు ఫోన్ చేస్తున్నా.. అవడం లేదని, బిల్లు సుమారు రూ.15 వేలు అయిందని హోటల్ మేనేజర్ అబ్బాస్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మళ్లీ జూన్ 29న డాక్టర్ ఆనంద్ ఫోన్ చేసి.. ఏలూరు నుంచి తమ పేషెంట్లు వస్తున్నారని, వీరితో డబ్బులు పంపిస్తానని, వీరికి కూడా రూంలు బుక్ చేయాలని కోరడంతో ఇచ్చారు. వీరు ఒక్క రోజు ఉండి రూమ్ ఖాళీ చేసే సమయంలో బిల్ డబ్బులు అడగ్గా.. డాక్టర్ ఆనంద్ చెల్లిస్తారని చెప్పి వెళ్లిపోయారని హోటల్ మేనేజర్ గురువారం ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సీఐ ఎ.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ చిన్నంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వణికిస్తున్న వైరల్ ఫీవర్స్

- 58వ వార్డులో విష జ్వరాల విజృంభణ
- ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న రోగులు



ములగాడ విలేజ్ ఆరోగ్య కేంద్రంలో మంచాలపై విష జ్వర పీడితులు



ఆస్పత్రిలో జ్వర పీడితులకు సపర్యలు చేస్తున్న కుటుంబ సభ్యులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు వాసులను వైరల్ ఫీవర్స్ వణికిస్తున్నాయి. విష జ్వరాల బారిన పడిన వారు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ములగాడ, కోడిపందాల దిబ్బ ప్రాంత వాసులు మూడు రోజులుగా విష జ్వరాలతో బాధపడుతున్నారు. వీరంతా ములగాడ విలేజ్ వద్ద గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బారులు తీరుతున్నారు. నిజానికి ఇక్కడ ఉన్నది 10 పడకల ఆస్పత్రే అయినప్పటికీ రోగుల తాకిడి అధికంగా ఉండటంతో మంచాలు సరిపోవడం లేదు. ఈ యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ తిలక్ జ్వర పీడితులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు. రోగులు ఎవరూ ఇబ్బంది పడకుండా చూసుకుంటున్నారు. రోజూ ఇక్కడికి సుమారు 40 మంది వరకు జ్వర పీడితులు వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ఇటీవల వాతావరణంలో కలిగిన మార్పుల కారణంగా వైరల్ ఫీవర్ బాధితులు ఎక్కువయ్యారని వివరించారు.

స్మార్ట్ మీటర్లు పెడితే తిప్పి పంపండి



మాట్లాడుతున్న సీపీఎం నేత జగ్గునాయుడు

మల్కాపురం: స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని ఎవరైనా తమ ఇంటికి వస్తే మరుక్షణమే వారిని అక్కడి నుంచి తిప్పి పంపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం 58వ వార్డు కోడిపందాలదిబ్బ వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్లు పెట్టడానికి కూటమి సర్కార్ తహతహ లాడుతోందన్నారు. కేంద్రం వద్ద మెప్పు పొందేందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు స్మార్ట్ మీటర్లను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. స్మార్ట్ మీటర్‌ను ఒక్క సారి ఇంటికి అమర్చితే ఇక జీవితాంతం ఆర్థిక భారం తప్పదన్నారు. ఒక్క విద్యుత్ స్మార్ట్ మీటర్ ధర రూ.9 వేల నుంచి రూ.13 వేల వరకు ఉంటుందని, ఆ భారమంతా ప్రజలపైనే వేస్తారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును సీపీఎం వ్యతిరేకిస్తోందని, ఈ విషయంలో ప్రజలకు అండగా నిలబడి పోరాడుతామని జగ్గునాయుడు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పైడిరాజు, పెంటారావు, నూకరాజు, సూరిబాబు, రమణ, శ్రీను పాల్గొన్నారు.

ఆహార వ్యాపారులకు ఫాస్టాక్ సర్టిఫికెట్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పతివాడ శ్రీను

సీతంపేట: పాన్ ఇండియా ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ పార్టనర్ కేవీజీవీఎం ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రతా సంస్థ(ఫాసి) ఆమోదించిన ఫాస్టాక్ శిక్షణ, సర్టిఫికెట్ కార్యక్రమం గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పతివాడ శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు దండి ప్రియాంక, గవర వెంకటరమణారావు మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత సంస్థ నియమాలు పాటించాలన్నారు. ప్రతి ఆహార వ్యాపారి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆదాయమే ప్రధానం కాకుండా మనసాక్షితో సేఫ్టీ ఫుడ్‌ను ప్రజలకు అందించాలని కోరారు. ఫుడ్ లైసెన్స్‌తోపాటు ఫాస్టాక్ ట్రైనింగ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఫాస్టాక్ ట్రైనర్ డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ 2017 అక్టోబర్ 6, ఎఫ్‌ఎస్‌ఎస్ యాక్ట్ సెక్షన్ 16(3)హెచ్ ప్రకారం ప్రతి వీధి వ్యాపారి మొదలు తినుబండారాలు అమ్మేవారు, తయారు చేసే వారు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బిర్యానీ కర్రీపాయింట్లు, బేకరీలు, స్వీట్‌షాప్స్, చికెన్, మటన్ దుకాణాలు కచ్చితంగా ఫుడ్ లైసెన్స్‌తోపాటు ఫాస్టాక్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. కేవీజీవీఎం సౌత్ ఇండియా ఇన్‌చార్జిలు సి.మోహన్‌బాబు, సింధు మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఆహార భద్రత, నాణ్యత పాటించడం, కల్తీని గుర్తించడం ఫాస్టాక్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా టీంహెడ్ కాండవ గాయత్రి, జగన్ మురారి, ఎగ్జిక్యూటివ్స్ సూర్య, శ్రీదేవి, దీప్తి, వసంత, లావణ్య, పెద్ద సంఖ్యలో ఫుడ్ వ్యాపారులు పాల్గొన్నారు.